క్లుప్తంగా

మానవ శ్రేయస్సు కోరే గ్రంథం భగవద్గీత



ప్రసంగిస్తున్న చాపాడు వెంకటసుబ్బారెడ్డి

చాపాడు : సకల మానవ శ్రేయస్సు కోరే గ్రంథం భగవద్గీత అని ఉపన్యాసకులు చాపాడు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. చాపాడు మండలం సీతారామాపురం గ్రామంలోని రామాలయంలో తిరుమల, తిరుపతి ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం భగవద్గీత అనే అంశంపై ఆయన ప్రసంగించారు. మానవ జీవితానికి చైతన్య దీపిక భగవద్గీత అని అన్నారు. భగవద్గీత భగవంతుని హృదయమని, ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రోగ్రాం అసిస్టెట్ గోపిబాబు పర్యవేక్షణలో నిర్వహించారు.

యానిమేటర్లకు శిక్షణ

మైదుకూరు : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వెలుగు ఆధ్వర్యంలో గురువారం యానిమేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక వెలుగు సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి కుటుంబ జీవనోపాధులు పెంచుకునేందుకు, ఆదాయ మార్గాలు, రుణాలపై కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఈ ప్రణాళికను ఏప్రిల్ 10వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉందని వెలుగు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్‌పీఈ వెంకటేశ్వర్లు, డీపీఎం నీలకంఠారెడ్డి, ధనుంజయ, ఏపీఎం జయరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి



రైతు సేవాకేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు

అట్లూరు : రైతులు ప్రభుత్వ ప్రయోజనాలు (రాయితీలు) పొందాలంటే ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. ఆయన బద్వేలు అర్బన్ రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులకు 50 శాతం రాయితీతో వ్యవసాయ శాఖ అందిస్తున్న వ్యవసాయ పనిముట్లను పొందేందుకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

1 నుంచి ఉచిత పాలిసెట్ కోచింగ్

ప్రొద్దుటూరు కల్చరల్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి పాలిసెట్–2025 ప్రవేశ పరీక్షకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్టు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా గౌరవ సలహాదారుడు వై.గోపినాథ్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో గురువారం పాలిసెట్ కోచింగ్‌కు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పూర్తయిన విద్యార్థులకు స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లో గల జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కోచింగ్ అందిస్తామన్నారు. కోచింగ్ తీసుకోదలచిన వారు 9705333305 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 29న (శనివారం) నిర్వహిస్తున్నట్టు కమిషనర్ శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అధికారులు, సభ్యులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

మానవత్వం చాటిన మాస్క్ అసోసియేషన్ సభ్యులు



సురేంద్ర కుటుంబసభ్యులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మాస్క్ అసోసియేషన్ నాయకులు

బద్వేలు అర్బన్ : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న ఓ యువకుడికి గురువారం మాస్క్ అసోసియేషన్ సభ్యులు రూ.5వేలు నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందచేసి మానవత్వం చాటారు. పట్టణంలోని వెంకటయ్యనగర్‌కు చెందిన సురేంద్ర ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదం జరిగి సురేంద్ర తీవ్ర గాయాలపాలయ్యాడు. అసలే పేదరికం.. విషయం తెలుసుకున్న మాస్క్ కమిటీ అధ్యక్షుడు అల్లాబకాష్ వెంటనే స్పందించి సురేంద్ర కుటుంబసభ్యులకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

శాంతికాముకుడి ముసుగులో

ఎమ్మెల్యే వరద దాడి చేశారు

- అర్హత లేకున్నా ఉప సర్పంచ్ పదవిని దక్కించుకోవాలనుకున్నారు
- టీడీపీ కార్యకర్తలు గుండాలుగా మారి మరణాయుధాలతో దాడి చేశారు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : తనకు తాను శాంతి కాముకుడని జబ్బలు చరుచుకునే టీడీపీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అర్హత లేని ఉప సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు తెగబడ్డారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడిన అనంతరం గురువారం సాయంత్రం దొరసానిపల్లెలోని తన స్వగృహంలో వార్డు మెంబర్లతో కలసి రాచమల్లు మీడియా సమావేశం నిర్వహించారు. ఉప సర్పంచ్ ఎన్నిక సందర్భంగా పెద్దాయన ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని విమర్శించారు. గతంలో ఆయన ఎన్నో ఇలాంటి సంఘటనలకు పాల్పడ్డారన్నారు. 20వేలు జనాభా గల గోపవరం పంచాయతీకి సర్పంచ్‌తో పాటు 20 మంది వార్డు సభ్యులు, ఐదు మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఈ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా చేశామన్నారు. ఆ ఎన్నికల్లో టీడీపీ తరఫున ఒకే వార్డు మెంబర్ ఎన్నికయ్యారని, ప్రస్తుతం తమ వార్డు సభ్యుల మధ్య సమస్య కారణంగా మరో ఐదు మంది టీడీపీలో చేరారన్నారు. ఐదు మంది ఎంపీటీసీ సభ్యులు తమ పార్టీ వారేనని తెలిపారు. ఈ ఎన్నికల్లో తమ వర్గీయులను గెలిపించుకునేందుకు ఎమ్మెల్యే దౌర్జన్యానికి పాల్పడ్డారని చెప్పారు. పెద్దశెట్టిపల్లె, అర్కటవేముల, సోమాపురం, సీతంపల్లె ఇలా అనేక గ్రామ పంచాయతీ సర్పంచ్‌లుగా టీడీపీ మద్దతుదారులే ఉన్నారని, గత సర్పంచ్ ఎన్నికలు సక్రమంగా జరిగాయనే దానికి ఇదే ఉదాహరణ అన్నారు. తన హయాంలో పక్కాగా ఎన్నికలు జరిపించామని, ఇప్పుడు టీడీపీ నేతలు దొడ్డిదారిన ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

ఆరుగురు ఉంటే ఎలా పోటీ చేస్తారు..

ఉపసర్పంచ్ ఎన్నికకు సంబంధించి 20 మంది వార్డు సభ్యుల్లో 14 మంది తమ వైపు ఉన్నా ఎమ్మెల్యే వరద తమ అభ్యర్థిని బరిలోకి దింపారని రాచమల్లు తెలిపారు. గత నాలుగు రోజులుగా టీడీపీ నాయకులు తమ వార్డు సభ్యుల ఇళ్ల వద్దకు వెళ్లి డబ్బు ఇస్తామని ఆశ చూపడం, ఉద్యోగాలు ఇస్తామని, అమృతానగర్‌లో స్థలం ఇస్తామని ఇలా ఎన్నో ప్రలోభాలకు గురిచేశారన్నారు. వార్డు సభ్యులు అందుబాటులో లేకున్నా వారి కుటుంబ సభ్యులను ఆశ్రయించారన్నారు. అయినా వారు అంగీకరించకపోవడంతో తమ ప్రభుత్వం అధికారంలో ఉందని, పోలీసులను అడ్డం పెట్టుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. వందల మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నిక జరుగుతున్న ప్రాంతంలో తిరుగుతున్నా పట్టించుకోని పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకులను బయటికి రాకుండా నిరోధించారన్నారు. పోలీసులు వందకు వంద శాతం టీడీపీకి అనుకూలంగా పనిచేశారన్నారు. సచివాలయ కార్యదర్శి మహేశ్వరితోపాటు ఎన్నికల అధికారి రామాంజనేయరెడ్డిని టీడీపీ నాయకులు తీవ్రంగా బెదిరించారన్నారు. అయినా వారు మాట వినకుండా ఉద్యోగ ధర్మం నిర్వహించినందుకు రాచమల్లు వారికి అభినందనలు తెలిపారు. గతంలో ముక్తియార్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా కూడా వరదరాజులరెడ్డి ఆర్డీఓను అడ్డం పెట్టుకుని ఇలాగే వ్యవహరించారన్నారు. ఈ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు ఎంవీ రమణారెడ్డి, మల్లెల లింగారెడ్డితో పాటు కొవ్వూరు రామసుబ్బారెడ్డి కుటుంబీకులు ఎవ్వరు ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడలేదని, కేవలం వరద మాత్రమే ఇలా చేస్తున్నారన్నారు. 14 మంది వార్డు సభ్యులపై దాడులకు పాల్పడ్డా పోలీసులు చూస్తూ ప్రేక్షక పాత్ర వహించారన్నారు. ఈ దాడుల సందర్భంగా ఎవరైనా వార్డు మెంబర్ చనిపోయి ఉంటే పరిస్థితి ఏవిధంగా ఉండేదని ప్రశ్నించారు. ఆ మరణానికి కారుకులు ఎవరవుతారని అన్నారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించారని విమర్శించారు. మేం ఎంతో ఓర్పుగా ఉండటంతో నియోజకవర్గం శాంతియుతంగా ఉందని అన్నారు. శుక్రవారం ప్రశాంతంగా ఎన్నిక నిర్వహించాలని ఎస్పీని స్వయాన కోరినట్లు రాచమల్లు తెలిపారు. ఉపసర్పంచ్ అభ్యర్థి రాఘవేంద్రారెడ్డి, వార్డు మెంబర్ వెంకటేష్, డ్రైవర్ హరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్వారకానగర్ వెంకటేశ్వర రెడ్డిపై టీడీపీ నాయకులు దాడులు చేసి మొబైల్ లాక్కున్నారని, ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో గోపవరం పంచాయతీ సర్పంచ్ గద్దా మోషా, ఉపసర్పంచ్ అభ్యర్థి బీరం రాఘవేంద్రారెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బెదిరించి.. భయపెట్టారు

ఉప సర్పంచ్ అభ్యర్థి రాఘవేంద్రారెడ్డి



ప్రొద్దుటూరు : గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సందర్భంగా టీడీపీ నేతలు తమను బెదిరించి.. భయపెట్టి ప్రలోభపెట్టారని వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన ఉప సర్పంచ్ అభ్యర్థి బీరం రాఘవేంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయాన్నే తాను ఎన్నిక కోసం గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి వెళుతుండగా టీడీపీ శ్రేణులు తనను కారులో నుంచి లాక్కెళ్లి దాడి చేశారన్నారు. తాను ప్రాణభయంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి వెళ్లినట్టు తెలిపారు. ఎన్నికకు వైఎస్సార్‌సీపీ తరఫున ఇద్దరం మాత్రమే హాజరు కాగా.. బయట ఉన్న 12 మంది వార్డు సభ్యులను లోనికి రాకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారన్నారు. కార్యాలయం లోపల ఎన్నిక సందర్భంగా టీడీపీ నాయకులు.. అధికారులను తీవ్ర ఒత్తిడికి గురి చేశారన్నారు. కోరం లేకున్నా ఎన్నిక జరపాలని కోరగా అధికారులు అంగీకరించలేదన్నారు. తన వెంట వచ్చిన పవన్ కుమార్‌ను టీడీపీ నాయకులు బెదిరించి భయపెట్టి తీసుకెళ్లారన్నారు.

నూతన జడ్పీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



రామగోవిందరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

పోరుమామిళ్ల : జిల్లా పరిషత్ నూతన చైర్మెన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ముత్యాల రామగోవిందరెడ్డిని గురువారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. అధికారపార్టీ కూటమి నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, జిల్లా పరిషత్ పీఠాన్ని దక్కించుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయించిన అభ్యర్థి రామగోవిందరెడ్డి ఏకగ్రీవంగా పదవికి ఎన్నికయ్యారని గోవిందరెడ్డి పేర్కొన్నారు.

రామగోవిందరెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త కె. రమణారెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌లకు ఘన సన్మానం



మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని సన్మానిస్తున్న రెడ్యం సోదరులు

చాపాడు : వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైన ముత్యాల రామగోవిందరెడ్డిలను గురువారం రెడ్యం సోదరులు సన్మానించారు. వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని ప్రొద్దుటూరులోని ఆయన స్వగృహంలో, జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైన ముత్యాల రామగోవిందరెడ్డిని కడపలోని ఆయన స్వగృహంలో కలిసి వారు సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నేత, ఏపీ ఎస్ఆర్‌టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ దువ్వూరు మండల అధ్యక్షుడు ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి, ఇండ్ల వెంకట్‌రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై రఘురామిరెడ్డి, రామగోవిందరెడ్డిలతో రెడ్యం సోదరులు చర్చించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంలో తన అనుభవాన్ని వివరిస్తున్న రైతు

ప్రొద్దుటూరు : మండలంలోని తాళ్లమాపురం గ్రామంలో గురువారం సుస్థిర వ్యవసాయం, ప్రొద్దుటూరు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు, రైతు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సుస్థిర వ్యవసాయ కేంద్రం రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసి మన ఆరోగ్యం, మన నేలను రైతులు కాపాడాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సక్సెస్ స్టోరీలను వివరించారు. అగ్రికల్చర్ ప్రోగ్రాం ఆఫీసర్ పోలు రవితేజ ప్రకృతి వ్యవసాయంపైన మెలకువలు తెలిపారు. సుస్థిర వ్యవసాయ కేంద్ర ఉత్పత్తిదారుల సంఘం ప్రోగ్రాం ఆఫీసర్ రమణ రైతు సంఘాల ఏర్పాటు వల్ల కలిగే ఉపయోగాలను, సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పవన్‌కుమార్, న్యాచురల్ ఫార్మింగ్ కోఆర్డినేటర్ నాగవేణి, తాళ్లమాపురం, రేగుళ్లపల్లె గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఖాజీపేట వైస్ ఎంపీపీగా స్వప్న



ముమ్మడి స్వప్న

ఖాజీపేట: ఖాజీపేట వైస్ ఎంపీపీగా భూమాయపల్లె ఎంపీటీసీ సభ్యురాలు ముమ్మడి స్వప్న ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ తరుపున ఖాజీపేట -3 ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి ఎన్నికైయ్యారు. అయితే ఆయన తన పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో ఆ ఖాళీ స్థానానికి ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎన్నిక జరిగింది. ఖాజీపేట మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలున్నాయి. 14 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందారు. అందులో చెన్నముక్కపల్లె ఎంపీటీసీ రాజీనామా చేశారు. ఎన్నికల ముందు ఖాజీపేట -3 చంద్రభాస్కర్‌రెడ్డి, నాగసానిపల్లె ఎంపీటీసీ సుహాసిని టీడీపీలో చేరారు. ఖాజీపేట -2 ఎంపీటీసీ కరీమున్నీసా కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో వైఎస్సార్‌సీపీ బలం 10కి తగ్గిపోయింది.

పోటీగా రెబల్ అభ్యర్థి: వైఎస్సార్‌సీపీ తరుపున రావులపల్లె ఎంపీటీసీ కనపర్తి సుబ్బారెడ్డి పోటీ చేశారు. ఆయనకు పోటీగా భూమాయపల్లె ముమ్మడి స్వప్న పోటీలో దిగారు. హోరాహోరీగా జరిగిన ఎన్నికలో సుబ్బారెడ్డికి మూడు ఓట్లు వచ్చాయి. ముమ్మడి స్వప్నకు వైఎస్సార్‌సీపీ తరుపున గెలిచిన 4 ఎంపీటీసీలతో పాటు కాంగ్రెస్ ఎంపీటీసీ కూడా మద్దతు ప్రకటించారు. దీంతో స్వప్నకు ఆరు ఓట్లు లభించాయి. రెండు ఓట్లు తేడాతో వైస్ ఎంపీపీగా స్వప్న విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం ఆమెకు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

ముగ్గురు యువకుల అరెస్టు

పోరుమామిళ్ల : స్థానిక పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద గురువారం మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురు యువకులను ఎస్ఐ కొండారెడ్డి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

గోపవరం పంచాయతీ పరిసరాల్లో 144 సెక్షన్

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీకి సంబంధించి శుక్రవారం జరగనున్న ఉప సర్పంచ్ ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు డీఎస్పీ భావన ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే సబ్ డివిజన్ వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. గోపవరం పంచాయతీ కార్యాలయ పరిసరాల్లో నలుగురు కంటే ఎక్కువ మంది గుమికూడ వద్దని డీఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ఎక్కడా ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

న్యాయవాదులకు శిక్షణ

కడప అర్బన్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తమ సిబ్బందితో కలిసి కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న న్యాయ సేవా సదన్‌లో నాలుగవ రోజు గురువారం కూడా ×మధ్యవర్తిత్వం€పై న్యాయవాదులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ నుంచి వచ్చిన రీసోర్స్ పర్సన్‌లు పీజీ సురేష్, జి.జ్యోతి మాట్లాడుతూ ప్రతిస్తంభన దశలు, మధ్యవర్తుల ప్రతిబింబాలు, నిర్వహణ, వ్యూహాలు, ప్రచురణ, ప్రకటనలు చట్టపరమైన సలహా తదితర అంశాలను వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : కడపలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (మైనార్టీ బాలుర)లో 2025-26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సోమ సత్యశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మైనార్టీ బాలురతోపాటు ఎస్సీ, ఎస్టీ బాలురు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 25వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 77801 79446, 90595 00173 సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై చర్య తీసుకోవాలి



కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : తెలుగు రాష్ట్రాల్లో రోజు రోజుకు మోటార్ బైక్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, క్షణాల్లో నిండుప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి తెలిపారు. గురువారం కృష్ణ శారద డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. హెల్మెట్ ధరించక పోవడం, మద్యం సేవించి బైక్ నడపటం, అతివేగంగా పోవడం, ముగ్గురు, నలుగురు ఒక బైక్‌పై పోవడం, మైనర్లు బైకులు నడపటం ప్రమాదాలకు కారణమన్నారు. రెండు రోజుల క్రితం లింగారెడ్డిపల్లె దగ్గర రెండు మోటార్ బైకులు ఢీకొని రాజారెడ్డి(40) చనిపోయాడన్నారు. అతను హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు కాపాడుకునేవాడన్నారు. ముద్దనూరు దగ్గర భార్యాభర్తలు బైక్ ప్రమాదంలో చనిపోతే పిల్లలు అనాథలయ్యారన్నారు. రాజంపేట దగ్గర రెండు బైకులు ఢీకొట్టుకుని ఇద్దరు చనిపోవడానికి కారణం ఇరువురికి హెల్మెట్లు లేకపోవడమేనన్నారు. ఎద్దడుగు కనుమ దగ్గర కాశినాయ మండలం చిన్నాయపల్లెకు చెందిన భార్యాభర్త, కూతురు బైక్‌పై పోతుండగా వెనుకనుండి టిప్పర్ ఢీకొట్టి ముగ్గురి ప్రాణాలు తీసిన ఘటన, అక్కడి రక్తపు మరకలు ఇంకా చెరిగిపోలేదన్నారు. పోరుమామిళ్ల పరిసర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి, పోగాకు ఉత్పత్తులతో మత్తులో వాహనాలు (టిప్పర్లు, లారీలు, బస్సులు) నడిపేవారిపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. కర్ణాటకలో బైక్‌పై వెనుక కూర్చున్న వారికి కూడా హెల్మెట్ ఉండాలని, ఈ విషయంలో కర్ణాటక పోలీసులు ఖచ్చితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

బడ్జెట్ ప్రణాళికను సిద్ధం చేయండి



మాట్లాడుతున్న సెర్ప్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ వెంకటేశ్వరరావు

ప్రొద్దుటూరు రూరల్ : 2025–26 ఆర్థిక సంవత్సరానికి డ్వాక్రా మహిళల అవసరాలకు సంబంధించి రుణాలపై బడ్జెట్ ప్రణాళికను సిద్ధం చేయాలని సెర్ప్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న వెలుగు కార్యాలయంలో గురువారం వీఓఏలు, యానిమేటర్లకు వార్షిక, ఆర్థిక, జీవనోపాధుల ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రతి సంఘం వద్దకు వెళ్లి వారి అవసరాలపై, రుణాల మంజూరుపై అవగాహన కల్పించి సర్వే నిర్వహించాలన్నారు. సంఘ సభ్యులు అడిగే రుణాలను బ్యాంక్ లికేజీ ద్వారా, గ్రామ సంఘం నిధి నుంచి, స్త్రీ నిధి నుంచి కానీ మంజూరు చేయాలన్నారు. సంఘాల్లోని 10వ తరగతి అర్హత గల సభ్యులతో ఈ సర్వే నిర్వహించాలన్నారు. ఒక్కొక్కరికి కేవలం ఐదు సంఘాలు కేటాయించి ఆర్థిక అవసరాలపై సర్వేని పూర్తి చేయాలన్నారు. ఇచ్చే రుణాలతో సంఘాల సభ్యులు ఏవిధంగా వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతారో తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐబీపీఎం నీలకంఠారెడ్డి, బీపీఎం ఫైనాన్స్ అధికారి లావణ్య, ఏపీఎం వెంకటసుబ్బమ్మ, సీసీలు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



అర్హుల జాబితా పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : అభ్యంతరం లేని ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించిన ఇళ్ళ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రతిఒక్క లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ తెలిపారు. ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించిన గృహాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 30 పై గురువారం పట్టణంలోని శివానగర్, మహబూబ్‌నగర్ సచివాలయల పరిధిలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 అక్టోబర్ 15కు ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన పూర్తిస్థాయి ఇళ్ళకు మాత్రమే క్రమబద్ధీకరణ అవకాశం కల్పించారని తెలిపారు. 150 చదరపు గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారని, అయితే లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఐటీ చెల్లింపుదారులై ఉండకూడదని తెలిపారు. అంతేకాకుండా చెరువు పోరంబోకులు, లేఅవుట్ స్థలాలలో నిర్మించిన ఇళ్ళకు క్రమబద్ధీకరణ అవకాశం లేదని, అలాగే ఖాళీ స్థలాలు, వాటిలో తాత్కాలిక ఇళ్ళు నిర్మించిన వారు క్రమబద్ధీకరణకు అనర్హులని తెలిపారు. కార్యక్రమంలో గోపవరం తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బందితో పాటు వార్డు రెవెన్యూ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.